క్లుప్తంగా

నిత్యావసరాల వితరణ



సరుకులు అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: రొంపేడు గ్రామ సమీపంలోని సృజన ప్రియ ఫిల్లింగ్ స్టేషన్ వార్షికోత్సవం పురస్కరించుకొని యాజమాన్యం పేదలకు సోమవారం చేయూతనందించారు. బంక్ ఆవరణలో మూడు పేద కుటుంబాలకు 75 కిలోల బియ్యం, ఒక నెలకు సరిపడా సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫిల్లింగ్ స్టేషన్ మేనేజర్ అజహర్, సిబ్బంది జి.ఎస్.రెడ్డి, ఆసిఫ్, సైదులు, సాయి, శేఖర్, రంజిత్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీని హర్షిస్తూ క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్వేతండా గ్రామస్తులు

ఇల్లెందురూరల్: బోయితండా గ్రామపంచాయతీ సర్వేతండా గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీని హర్షిస్తూ గ్రామ రైతులు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఒకే విడతలో రుణమాఫీ చేయడంతోపాటు కొత్త రుణాలు ఇచ్చేలా బ్యాంకర్లను ఆదేశిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని లబ్ధిదారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జగదీష్‌నాయక్, ప్రేమ్‌కుమార్, సుమన్, బాలాజీ, రమేష్, సేవ, రవి, హచియా, మంగీలాల్, హరి, అనిత, బద్రి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి..



నర్సయ్యను పరామర్శిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: 1969 తెలంగాణ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్యకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని, వైద్యులను కోరినట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు శాంతిరామ్ తెలిపారు. కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రిలో జ్వరంతో బాధపడుతున్న నర్సయ్యను సోమవారం పరామర్శించారు. మాట్లాడుతూ.. ఉద్యమకారులకు న్యాయం జరగాలని నర్సయ్య ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో చింతలచెర్వు గోర్వైము, రామరావు, బలరాంసింగ్, కాశీవిశ్వనాథ్, శంకర్ తదితరులు ఉన్నారు.

ఎంపీఓ మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

చుంచుపల్లి: చుంచుపల్లి మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందిన గుంటి సత్యనారాయణకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్ కుమార్, సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్స్ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంపీఓ సత్యనారాయణ అందించిన సేవలను కొనియాడారు. వెంకటేశ్వర్లు, కిషోర్, రఘుపతి పావని తదితరులు పాల్గొన్నారు.

తోబుట్టువుల అనురాగ బంధం

తోబుట్టువుల అనుబంధానికి ప్రతీకగా నిర్వహించుకునే రాఖీ పౌర్ణమి వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి ఆశీర్వాదం తీసుకున్నారు. మహిళలు తమ సోదరులకు రాఖీ కట్టేందుకు అత్తగారింటి నుంచి పుట్టిళ్లకు తరలిరావడంతో ఇళ్లు కళకళలాడాయి. బస్సులు, ఆటోల్లో రద్దీ పెరిగింది. అంతేకాకుండా కార్లు, ద్విచక్రవాహనాలతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రాఖీ, స్వీట్ దుకాణాల వద్ద మహిళలు, యువతులు బారులు తీరారు.

– సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి: తొమ్మిదోమైలు తండాలో.. చిన్నారుల ఆనందం



సుజాతనగర్: రాఖీ కడుతున్న ఎంపీడీఓ భారతి



జూలూరుపాడు: పాపకొల్లులో..



ఇల్లెందు: చైర్మన్ డీవీకి రాఖీ కడుతున్న మున్సిపల్ సిబ్బంది



ఇల్లెందు: సీఐ సత్యనారాయణకు రాఖీ కడుతున్న విద్యార్థినులు





జూలూరుపాడు: కరివారిగూడెంలో..



కొత్తగూడెం వన్‌టౌన్‌లో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుకు రాఖీ కడుతున్న విద్యార్థిని



కొత్తగూడెంటౌన్: సోదరులకు రాఖీ కడుతున్న చిన్నారులు



పాల్వంచరూరల్: కొత్వాలకు రాఖీ కడుతున్న ముస్లిం మహిళ



తహసీల్దార్ వివేక్‌కు రాఖీ కడుతున్న సోదరి డాక్టర్ సింధూరి



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో రాంచందర్‌కు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే కనకయ్య సతీమణి లక్ష్మి



కొత్తగూడెంటౌన్: కోనేరు చిన్నికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



కొత్తగూడెంఅర్బన్: సాబీర్‌పాషాకు రాఖీ కడుతున్న మహిళా నాయకురాలు



కొత్తగూడెంఅర్బన్: కౌన్సిలర్లకు రాఖీ కట్టిన చైర్‌పర్సన్ సీతాలక్ష్మి

రాజ్యాధికారం దక్కే వరకు విశ్రమించొద్దు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పాల్వంచ: బహుజనులకు రాజ్యాధికారం దక్కే వరకు విశ్రమించొద్దని సింగరేణి రిటైర్డ్ జీఎం శనగ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక బీఎస్పీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. ప్రతీ గ్రామానికి, ప్రతీ ఇంటికి బీఎస్పీని చేరువ చేసేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. బూటకపు వాగ్దానాలతో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. కేంద్రంలోని జాయింట్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ వంటి 45 ఉన్నత పోస్టులపై నేరుగా లెటరల్ ఎంట్రీ ద్వారా రిక్రూట్‌మెంట్ నిర్ణయం సరైంది కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారికి కోటా నిష్పత్తి ప్రకారం ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీన జరిగే భారత్ బంద్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బహుజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పెన్షన్ రివిజన్ నిర్ణయాన్ని అమలు చేయాలి



సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న పెన్షనర్లు

కొత్తగూడెంఅర్బన్: పెన్షన్ రివిజన్ వెంటనే అమలు చేయాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ స్టేట్ సెక్రెటరీ రామచంద్రులు అన్నారు. కొత్తగూడెంలో సోమవారం అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. మాట్లాడుతూ.. ప్రతీ జిల్లా కేంద్రాలలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, తగిన ఆస్పత్రులను గుర్తించాలన్నారు. ఖమ్మం ఏరియాలో అసోసియేషన్‌ను ఇంకా బలోపేతం చేయాలని సభ్యులకు సూచనలు చేశారు. అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తున్న కొత్తగూడెం బీఎస్ఎన్ఎల్ సూపరింటెండెంట్ శివరాంజీని సన్మానించారు.

అవినీతిపై విచారించండి..

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీలో అవినీతిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు కనగాల అనంతరాములు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మున్సిపాలిటీలో తొమ్మిది సంవత్సరాలుగా మొక్కల పేరుతో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపించారు. గతంలో పనిచేసిన కమిషనర్, డీఈ, ఏఈలు బినామీ కాంట్రాక్టర్ల పేరుతో దండుకున్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నట్లు చెప్పారు. దీనిపై మున్సిపల్ శాఖ, పంచాయతీ శాఖ మంత్రి, కలెక్టర్ స్పందించి విచారణ చేయించాలన్నారు. అదేవిధంగా కొత్తగూడెం, పాల్వంచను కలిపి కార్పొరేషన్ చేయాలని కోరారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

టేకులపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని టేకులపల్లి మండల వైద్యాధికారి కందుల దినేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని పెట్రాంచలక, కొత్త తండా, కిష్టారం, తొమ్మిదో మైలుతండా, రాంపురం, గంగారం, దుబ్బ తండా, బొమ్మనపల్లి, మంగలి తండా గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించారు. అనారోగ్యంతో ఉన్న వారికి రక్త పరీక్షలు చేసి తగిన చికిత్స అందించి అవసరమైన మందులను అందజేశారు. అనంతరం గ్రామాలలో నిల్వ నీటిని తొలగించారు. ఈ సందర్భంగా ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆస్పత్రి మెట్లు ఎక్కకుండా జీవించాలంటే వ్యాధులపై అవగాహన కలిగి ఉండడం అవసరమన్నారు. వ్యాధుల బారిన పడిన తర్వాత బాధపడే కంటే అవి రాకుండా అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా ప్రతీఒక్కరు విధిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ అదే సమయంలో ఇంటిచుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. వారానికి రెండుసార్లు డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని, దోమ కుట్టడం ద్వారా వచ్చే జ్వరాలు ఇప్పుడు అధికంగా నమోదవుతున్నాయని దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని సూచించారు. గాలి ద్వారా వ్యాపించే వైరల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జలుబు, దగ్గు జ్వరాలు ఉన్నవారు కుటుంబ సభ్యులకు మరియు ఇతరులకు వ్యాపించకుండా మాస్కులు ధరించాలని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో కలుషితమైన నీటి ద్వారా మరియు కలుషితమైన ఆహారాలు తినడం ద్వారా టైఫాయిడ్, కామెర్లు, వాంతులు, విరోచనాలు వస్తాయి కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో బహిరంగ ప్రదేశాలలోని అపరిశుభ్రమైన ఆహార పదార్థాలు, నీరు తీసుకోవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి దేవా, పబ్లిక్ హెల్త్ నర్సు చంద్రకళ, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, హెల్త్ విజిటర్ కౌసల్య, ధనసరి రాంబాబు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ శైలజ, హారిక, ఇంద్రజ, ధరణి ఏఎన్ఎంలు వీరభద్రమ్మ, స్వప్న, వెంకటరమణ పాల్గొన్నారు.



కిష్టారంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నిందితులను శిక్షించాలి

కొత్తగూడెంఅర్బన్: కోలకతా ఘటనను నిరసిస్తూ సీపీఐ రాష్ట్ర వ్యాపిత నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పార్టీ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ భవన్ నుంచి ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ.. దేశంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా పాలకుల్లో చలనం లేదని విమర్శించారు.

టేకులపల్లి: కోలకతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి ప్రాణాలు తీసిన నిందితులు ఎంతటి వారైన కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా నాయకుడు గుగులోత్ రాంచందర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయంలో నల్లబ్యాడ్జీలతో మౌన నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

జూలూరుపాడు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం జూలూరుపాడులో మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జ్వరబాధితులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనుమల్ల భద్రయ్య, సాంబ, సవడం వెంకటేశ్వర్లు, పాలెపు సత్యనారాయణ, యలబాలక రామాచారి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని సుభాష్‌నగర్‌లో సోమవారం ఫొటోగ్రాఫర్లు ఘనంగా నిర్వహించారు. ఇల్లెందు, గండాల, ఆళ్లపల్లి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లు వసంత్, బాలరాజు, మహిళా ఫొటోగ్రాఫర్లు నవ్య, పరిమళమిత్ర, రాధలను ఘనంగా సన్మానించారు.



ఇల్లెందురూరల్: లూయిస్ డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీని వృత్తిగా ఎంచుకొని స్వయం ఉపాధి పొందుతున్న వారంతా సమష్టిగా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఫొటోగ్రఫీని వృత్తిగా గుర్తించి సబ్సిడీపై రుణాలు, గృహసౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మారుతిప్రకాష్, కార్యదర్శి ఆకుల రమణ, మిత్రచిన్ని, రవి, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన బస్టాండ్లు

- ప్రైవేటు వాహనాలకు గిరాకీ
- రాఖీ పండుగ రద్దీకి తగ్గట్టు బస్సులు ఏర్పాటు చేయని ఆర్టీసీ అధికారులు
- అవస్థ పడిన ప్రయాణికులు

చుంచుపల్లి/ఇల్లెందు: రాఖీ పండుగ నేపథ్యంలో సోమవారం ఆర్టీసీ బస్సులు కళకళలాడుతూ కనిపించాయి. ఉచిత బస్సు ప్రవేశపెట్టిన తర్వాత వచ్చిన తొలి రక్షా బంధన్ పర్వదినం కావటం, తమ సోదరులకు రాఖీ కట్టేందుకు మహిళలు పుట్టింటికి బయలుదేరడంతో కొత్తగూడెం, ఇల్లెందు బస్టాండ్లు కిటకిటలాడాయి. ఈసారి రాఖీ పౌర్ణమి మహిళా ప్రయాణికులకు మరింతగా కలిసొచ్చింది. సోదరులకు రాఖీ కట్టేందుకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ప్రయాణికులు భారీ సంఖ్యలో బస్టాండ్లకు చేరుకోవడంతో ఇసుక వేస్తే రాలనంతగా నిండిపోయాయి. తెల్లరుజాము నుంచే బస్సులు కిటకిటలాడాయి. ఇల్లెందు బస్టాండ్ నుంచి గుండాలకు వైపు వెళ్లే పట్టణ ప్రజలకు గోవింద్ సెంటర్, చెరువు కట్ట ఏరియా, 21 ఫిట్ స్టేజీలు ఉండగా, ఇల్లెందు నుంచి మహబూబాబాద్ వైపు వెళ్లే వారికి గోవింద్ సెంటర్, సింగరేణి – మహబాద్ క్రాస్ రోడ్, ఇక ఖమ్మం– కొత్తగూడెం వైపులకు వెళ్లే పట్టణ ప్రజలకు బస్టాండ్ నుంచి పాత బస్టాండ్, జగదాంబా సెంటర్, ఆస్పత్రి, జేకే బస్టాప్, కరెంటాఫీస్‌లు ఉన్నాయి. ఆయా స్టేజీల్లో బస్సులు ఆపకుండా బస్టాండ్ నుంచే నిండి వెళ్లటంతో ప్రయాణికులు బస్టాండ్‌కు పరుగులు తీశారు. కొత్తగూడెంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్ని ప్రధాన బస్టాండ్లు మహిళా ప్రయాణికులతో నిండిపోయాయి. ఆర్టీసీ అధికారులు తగినన్ని బస్సులు ఏర్పాటు చేయకపోవటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణాన్ని రాఖీ పండుగ సందర్భంగా సద్వినియోగం చేసుకున్న మహిళలు పలువురు ఆనందం వ్యక్తం చేశారు.



ఇల్లెందు: బస్సు కోసం పరుగులు తీస్తున్న ప్రయాణికులు



ఇల్లెందు: ప్రయాణికులతో కిటకిటలాడిన బస్టాండ్





బస్టాండ్‌లోకి వచ్చి ప్రయాణికులను తీసుకెళ్తున్న టాటా మ్యాజిక్‌లు, కొత్తగూడెం బస్టాండ్‌లో...

వైభవంగా గిరిజనుల తీజ్ ఉత్సవం



తీజ్ బుట్టలతో బంజారా యువతులు

ఇల్లెందురూరల్: లంబాడా గిరిజనుల అత్యంత పవిత్రమైన తీజ్ (మొలకల పండుగ) ఉత్సవాలు బోయితండా గ్రామపంచాయతీ లక్ష్మీనారాయణతండా గ్రామంలో సోమవారం ఘనంగా జరిగాయి. వారంరోజుల పాటు కొనసాగిన వేడుకల్లో మొదటి రోజున యువతులు భక్తిశ్రద్ధలతో మొలకలు నాటారు. ప్రతీరోజు వాటికి ప్రత్యేక పూజలు చేసి చివరి రోజు సోమవారం ఉపవాస దీక్షలుండి భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు ఇంటి పెద్దల తలపాగాలో మొలకలు ఉంచి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వాటిని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బానోత్ సంతు, సుమన్, రాంజీ, మాలు, అనిల్, శ్రీను, తేజావత్ బాలు, బోడ శంకర్, భూక్య ఈరు, బానోత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.